సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 27 । జనవరి । 2025



పథకాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

ఇంటింటా సంక్షేమం

- ప్రజాపాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధి
- రైతులు, పేదల సంక్షేమానికి పెద్దపీట
- కేఎల్ఐ, అచ్చంపేట, మార్కండేయ ఎత్తిపోతలతో సాగునీరు
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ బదావత్ సంతోష్

'ప్రతి ఇంటా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ప్రజాపాలనలో భాగంగా రైతులు, పేదలు, బడుగు బలహీనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలుచేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసుకుని 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతి పల్లె, బస్తీల్లో సభలు నిర్వహించి.. నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టింది.' - కలెక్టర్ బదావత్ సంతోష్



పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రభుత్వం రైతు భరోసా కింద జిల్లాలో 3.22 లక్షల మంది రైతులకు ఎకరాకు రూ. 6వేల చొప్పున మొత్తం రూ. 444 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ. 12వేల ఆర్థికసహాయం అందిస్తుందని చెప్పారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కులగణనలో వచ్చిన 16,006 దరఖాస్తులను పరిశీలించి, కొత్త కార్డులను మంజూరుచేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 26,814 మంది కుటుంబ సభ్యులను పాత రేషన్‌కార్డుల్లో చేర్చామన్నారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డు అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున లబ్ధిదారులకు అందించనున్నట్టు చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో దాదాపు 4.26 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని పొందారన్నారు. 1.16 లక్షల మందికి రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్టు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తుండగా.. జిల్లాలో 1.5 లక్షల మంది వినియోగదారులు లబ్ధిపొందుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5లక్షల నుంచి 10 లక్షలకు పెంచడంతో పాటు జిల్లాలో ఇప్పటి వరకు రూ. 41.20 లక్షల మేరకు ప్రభుత్వం వైద్యసేవల కోసం ఖర్చు చేసిందని చెప్పారు.

వ్యవసాయం, సాగునీటి రంగానికి ప్రాధాన్యం..

జిల్లాలో రుణమాఫీ కింద 1,09,206 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 920.63 కోట్లు జమచేసి రుణ విముక్తులను చేసినట్టు వివరించారు. రైతుబీమా కింద 6,464 మంది రైతుల నామినీలకు రూ. 5 లక్షల చొప్పున వారి ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం విస్తరణ పనులకు రూ. 5,861 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. మొత్తం ఆయకట్టు 4.51 లక్షలకుగాను 3.7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 286.5 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్టు వివరించారు. కేఎల్ఐ విస్తరణ పనుల్లో భాగంగా అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లో 15వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పులిజాల నుంచి చంద్రసాగర్ చెరువు వరకు 1.5 కి.మీ. మేర బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. అచ్చంపేట లిఫ్ట్ స్టేజ్–1 పనుల్లో భాగంగా తెలకపల్లి, ఉప్పునుంతల, లింగాల, బల్మూర్, అచ్చంపేట మండలాల్లోని 61 గ్రామాల్లో 57,200 ఎకరాలకు నీరందించేందుకు రూ. 1,534 కోట్ల అంచనాలతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 12.30 లక్షల ఎకరాలకు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. రూ. 76.95 కోట్లతో మార్కండేయ ఎత్తిపోతల పథకం ద్వారా 7,310 ఎకరాలకు సాగునీరు అందించే పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

పైలెట్ ప్రాజెక్ట్ కింద బోరుబావులు..

పీఎం అజయ్ పైలెట్ ప్రాజెక్ట్ కింద అమ్రాబాద్ మండలంలోని ప్రశాంత్‌నగర్ గ్రామాన్ని ఎంపికచేసి, ఎస్సీ రైతుల జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 30 బోరుబావులకు గాను 12 బోర్లను డ్రిల్లింగ్ చేసినట్టు చెప్పారు. సీఎం గిరివికాసం కింద 691 మంది లబ్ధిదారులను గుర్తించి.. రూ. 6.40 కోట్లతో గిరిజన రైతులకు 221 బోరు డ్రిల్లింగ్‌లతో పాటు 190 బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25లో 1.20 లక్షల మందికి 32.38 లక్షల పనిదినాలు కల్పించామని తెలిపారు.

జిల్లాలో 768 ఆదర్శ పాఠశాలలు..

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమానికి జిల్లాలో మొత్తం 768 పాఠశాలలను ఎంపికచేశామని.. ఆయా పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు పెంచినట్టు వివరించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజక వర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు. గణతంత్ర వేడుకల్లో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన వేడుకలు

నాగర్‌కర్నూల్ క్రైం/కందనూలు: జిల్లావ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఊరూవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటుచేసిన వేడుకలకు కలెక్టర్ బదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐ జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదాయ పోలీసు కవాతు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధురాలు అంబటి నీలావతి సేవలను కలెక్టర్ కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎస్పీతో కలిసి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. తెలకపల్లి కేకే రెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, అచ్చంపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ, అచ్చంపేట ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ, పెద్దకొత్తపల్లి కేజీబీవీ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. అదే విధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయగా.. కలెక్టర్, ఎస్పీ తదితరులు పరిశీలించారు. అటవీశాఖ శకటానికి ప్రథమ, ఇందిరమ్మ ఇళ్ల శకటానికి ద్వితీయ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ శకటానికి తృతీయ బహుమతులు లభించాయి.





ఐనోలు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఇద్దరికి పోలీసు సేవా పతకాలు..

జిల్లా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందిస్తూ రాష్ట్ర పోలీసు సేవా పతకాలకు ఎంపికైన ఇద్దరికి కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా సేవా పతకాలను ప్రదానం చేశారు. సిద్ధాపూర్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పరుశరాములుగౌడ్ ఉత్తమ పోలీసు సేవా పతకాలను అందుకున్నారు.

పదేళ్లలో 'పాలమూరు' పూర్తి చేశారా?



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 'పేట– కొడంగల్' ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేకపోయారు
- కేసీఆర్, కేటీఆర్‌లకు సంపదలపై ఉన్న ధ్యాస ప్రాజెక్టులపై లేదు
- కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే సీఎం అయ్యా
- 20 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- పరిశ్రమలు నెలకొల్పుతుంటే రాజకీయం చేశారు..
- చంద్రవంచలో నూతన పథకాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే..

మీ అందరికీ తెలుసు 2023 వరకు కొడంగల్ నియోజకవర్గం ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా న్యాయం మాత్రం జరగలేదు.. 2023 డిసెంబర్ ఎన్నికల్లో పెద్దలు గుర్నాథరెడ్డి, ప్రజలందరూ ఆలోచించి ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని.. ఆ ప్రభుత్వం నాయకత్వం వహించాలని కష్టపడి అత్యధిక మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు తనను ముఖ్యమంత్రిగా నియమించడం కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్‌కు ఎక్కువ సమయం ఇవ్వలేకపోతున్నానని, కానీ 4 కోట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొడంగల్ అభివృద్ధికి పాటు పడుతున్నానన్నారు. నాలుగు కొత్త పథకాలు కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రారంభమయ్యాయంటే ఎంతో గౌరవంగా ఉందన్నారు.

నారాయణపేట/ కోస్గి: 'పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు– రంగారెడ్డి పూర్తి చేయలేకపోయారు. కనీసం నారాయణపేట– కొడంగల్ ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేదు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయొద్దన్నమా..? సంపదలపైన ఉన్న ధ్యాస కేసీఆర్, కేటీఆర్‌కు ప్రాజెక్టులపై లేకపాయె. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా..రాష్ట్రంలో వారి రాజకీయ మనుగడ ఉండదనే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రాజకీయం చేస్తూ అడ్డుకుంటున్నారు.. ఎవరెన్ని అడ్డుంకులు సృష్టించినా.. ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి.. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పథకాలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీఎం కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మిత్రులారా ఇందిరమ్మ రాజ్యం.. ప్రజాపరిపాలనలో మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని 13 నెలలు పూర్తి కావొస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం.. ఇందుకు వేదికైన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామాన్ని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు.



సభకు హాజరైన కొడంగల్ నియోజకవర్గ ప్రజలు

ఆధార్ మాదిరిగానే రేషన్‌కార్డు

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఎలాగో.. పేదలకు రేషన్ కార్డు అలాగే అని సీఎం పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు వచ్చిందా అంటూ కేసీఆర్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్.. అమెరికాలో కంప్యూటర్ చదువులు చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్నా సోయి ఎందుకు రాలేదని దుయ్యబట్టారు. రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తూ.. ఫిబ్రవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

అధికారులు ఎప్పుడైనా వచ్చారా..

గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో అధికారులు ఎప్పుడైనా గ్రామాల వైపు చూశారా అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో మూడుసార్లు గ్రామసభలు నిర్వహిస్తూ గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.

పరిశ్రమలు తెస్తే అడ్డుకున్నారు..

పరిశ్రమలు తేవాలని కొడంగల్ నియోజకవర్గంలో 1,300 ఎకరాల భూసేకరణ చేస్తే రాజకీయం చేస్తూ అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం ధ్వజమెత్తారు. వెనకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పెట్టుబడులు తీసుకువస్తుంటే అడ్డుకున్నారన్నారు. ఎప్పటికీ మనం వెనకబడే ఉండాలా..? కొడంగల్ యువకులు ఇంకా లుంగీలు కట్టుకొని బస్టాండ్లలో తిరగాలా..? కొడంగల్‌కు మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీలు రావొద్దా..? అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన మనుషులు కొడంగల్ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సొంతంగా రూ.కోట్లు వెచ్చించానని, కోస్గి బస్టాండ్ నిర్మాణానికి తన సొంత స్థలం ఇచ్చానని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలు రాష్ట్రానికి అంకితం ఇస్తున్నాం.. ప్రతి లబ్ధిదారుడికి మార్చి 31 నాటికి పథకాలన్నీ అందుతాయి.. వలస పోయిన కుటుంబాలు కూడా సొంతూరులో రేషన్‌కార్డులు తీసుకోవాలని సీఎం కోరారు. నిండు మనసుతో కొడంగల్ ప్రజలు అండగా నిలబడితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. దేళ్లలోపు కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని ముఖ్యమంత్రి ఆకాంక్ష భావం వ్యక్తం చేశారు. మన మాట.. మన బాట.. అభివృద్ధి, సంక్షేమమే అని సీఎం పునరుద్ఘాటించారు.

■ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా నాలుగు కొత్త పథకాలను చంద్రవంచలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు పథకాలు అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలు విజయవంతంగా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బేన్ షాలమ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ రామచంద్ర, గ్రంథాలయ చైర్మన్ విజయకుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కోస్గి మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంతో నల్లచట్టాలను రద్దుచేసిన కేంద్రం.. మళ్లీ దొడ్డిదారిన జాతీయ మార్కెట్ ముసాయిదాను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్యాయం చేస్తుందన్నారు. రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయడంతో పాటు వ్యవసాయ కూలీలకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, లక్ష్మణ్, రామయ్య, తిరుపతి రెడ్డి, అంతటి కాశన్న తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తావులేకుండా పథకాల అమలు



ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుకు ప్రొసీడింగ్ అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: పైరవీలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం కోడేరు మండలం పస్పుల గ్రామంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలను మంత్రి ప్రారంభించి.. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను ఏడాది కాలంలో అమలుచేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నట్టు వివరించారు. జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపికచేసి, కొత్త పథకాలను లాంచనంగా ప్రారంభించినట్లు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు నేరుగా పథకాలు అందిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావొద్దని.. పథకాలకు అనర్హులను ఎంపికచేస్తే చర్యలు తప్పవని అన్నారు. పదేళ్లుగా రేషన్ కార్డుకు నోచుకోని అనేక కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నామని చెప్పారు. రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ. 12వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12వేల చొప్పున అందిస్తామన్నారు. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి జూపల్లి లబ్ధిదారుల స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీఓ భన్సీలాల్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పురపాలికల్లో 'ప్రత్యేక' పాలన

సాక్షి, నాగర్‌కర్నూల్: పురపాలిక సంఘాల పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఆదివారం ప్రత్యేకాధికారులను నియమించింది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) దేవ సహాయం వ్యవహరించనున్నారు. కొత్త పాలకవర్గం ఎన్నికయ్యే వరకు ఆయన స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా, అచ్చంపేట మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం మరో ఏడాది తర్వాత పూర్తికానుంది.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

నాగర్‌కర్నూల్ క్రైం: మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి మౌనిక, సెకండ్ అడిషనల్ జూనియర్ సవిల్‌జడ్జి శ్రీనిధి పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకం ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ధన, మాన, ప్రాణ సంరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నట్టు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు పరేడ్ మైదానంలో..



మహబూబ్‌నగర్‌లో గ్రామదేవత వేషధారణలో..



గద్వాలలో గిరిజన వేషధారణలో..



జయహో..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూవాడ త్రివర్ణ శోభితంగా మారాయి. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలువురు తమ విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. జాతీయ పతాకం చేతబూని జయహో భారత్ అంటూ విన్యాసాలను ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో వివిధ శాఖల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శకటం ప్రదర్శన



గద్వాలలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలంటూ..



మహబూబ్‌నగర్‌లో..



వనపర్తిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ..



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ఏర్పాటుచేసిన శకటం



పాలమూరులో సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఇక్కడ విధులు నిర్వహించడం గర్వంగా ఉంది

- శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహించడం గర్వంగా ఉందని సీఈ రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈగలపెంటలోని శక్తిసదన్ కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ కేంద్రం జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన టార్గెట్ 2,000 యూనిట్లను అధిగమించి ఉత్పత్తి చేశామన్నారు. ఇంకా లోడ్ డిస్పాచ్ అడిగిన వెంటనే విద్యుత్తు ఉత్పత్తి సరఫరాకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఆణిముత్యం లాంటి కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఈ ఏడాది గణనీయంగా సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటిని తరలించామన్నారు. యాజమాన్యం ఇటీవల కేంద్రంకు ముప్పై మంది నూతన ఏఈలను కేటాయించిందని తెలిపారు. ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, కేంద్రం యావత్తు ఇంజినీర్లు ఉద్యోగులు పాల్గొన్నారు. తదుపరి ఎస్‌పీఎఫ్ ఆర్ఐ రవి పర్యవేక్షణలో ఎస్ఐలు అనూప్, శ్రావణ్, పోలీసుల నుంచి వందన స్వీకరించారు.



ఈగలపెంటలో శక్తిసదన్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఈ రామసుబ్బారెడ్డి

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి యువకుడి దుర్మరణం

ఉండవెల్లి: మండలంలోని జోగులాంబ రైల్వే స్టేషన్ సమీప మార్గంలో అభిషేక్(20) అనే యువకుడు ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వివరాలు.. కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన అభిషేక్ ట్రాక్టర్ మీద డ్రైవర్ కమతం రాజుతో కలిసి ఉండవెల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో కుక్క అడ్డురావడంతో ట్రాక్టర్ సడెన్ బ్రేక్ వేశాడు. అభిషేక్ టైరు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనిచిన స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యలోనే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా కమతం రాజు వాళ్ల అన్న కమతం దేవదానం కుమారుడు అభిషేక్. కుమారుడి మృతి చెందడంతో తమ్ముడు రాజుపై దేవదానం ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



అభిషేక్(ఫైల్)

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం


ఊట్కూర్: మండలంలోని పెద్దజట్రం గ్రామంలో కొత్తిలి రవికుమార్ (25) అనే యువకుడు శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లెపల్లి గ్రామానికి చెందిన నారాయణ కూతురు లక్ష్మితో రవికుమార్‌కు రెండేళ్ల క్రితం పెళ్లి అయ్యింది. కాగా ఆరు నెలల క్రితం హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో ఒక చేయి తీసివేశారు. సుమారు రూ. 10లక్షల వరకు ఖర్చుఅయింది. భార్య సంక్రాంతి పండుగకు వెళ్లి రాలేదు. డబ్బుల విషయమై సోదరులతో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపం చెందిన రవి శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతి చెందిన విషయమై రెండు రోజులుగా ఇరు కుంటుంబసభ్యులు, గ్రామ పెద్దలు పలుమార్లు పంచాయతీలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ కృష్ణంరాజుకు వివరణ కోరగా స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించాచామన్నారు. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.



రవికుమార్ (ఫైల్)

చికిత్స పొందుతూ..

పాన్‌గల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని గోప్లాపూర్‌కి చెందిన శేఖర్(20) ఈనెల 16న వనపర్తి మండలం మెట్‌పల్లి దగ్గర రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో గాయపడ్డాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో పది రోజుల నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడు అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



శేఖర్ (ఫైల్)

జాతీయ జెండాకు అవమానం

- ఆవిష్కరించిన గంటకే నేలకొరిగిన త్రివర్ణ పతాకం



వాల్యాతండా ప్రాథమిక పాఠశాల ఎదుట నేలకొరిగిన జాతీయ జెండా

భూత్పూర్ : గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాకు అవమానం జరిగింది. జెండాను ఆవిష్కరించిన గంటకే త్రివర్ణ పతాకం నేలకొరిగింది. భూత్పూర్ మున్సిపాలిటీలోని వాల్యాతండాలోని ప్రాథమిక పాఠశాల ముందు జాతీయ జెండాను ఎగరవేయడానికి దిమ్మెను సైతం ఏర్పాటు చేయలేదు. గతంలో ఏర్పాటుచేసిన దిమ్మెకు రంధ్రం చేసి వెదురుబొంగు కట్టెకు త్రివర్ణపతాకం, కాగితాలు అంటించి రాళ్లను పెట్టి జెండాను ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జెండా పండుగను జరుపుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. వారంతా వెళ్లిన గంటలోపే జాతీయ జెండా కింద పడిపోయింది. ఉపాధ్యాయుల అలసత్వం కారణంగా త్రివర్ణ పతకానికి అవమానం జరిగిందని వాల్యాతండా ప్రజలు ఆరోపిస్తున్నారు.



జాతీయ జెండా తలకిందులుగా..

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం పెద్దరేవల్లి రిపబ్లిక్‌డే సందర్భాంగా గ్రామ పంచాయతీ కార్యాలయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్, స్పెషల్ ఆఫీసర్ నుమాన్ జాతీయ జెండాను తలకిందులుగా ఎగరవేశారు. జాతీయ జెండాను ఉల్టా ఎగరవేయడంతో అక్కడున్న గ్రామస్తులు నాయకులు ఇదేంటని సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జెండాను కిందకి దింపి సరిచేసి మళ్లీ ఆవిష్కరించారు.

పెద్దరేవల్లిలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగరేసిన దృశ్యం →



కాలిన త్రివర్ణ పతాకం

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ఎగరవేసిన జాతీయ జెండా టపాసుల నిప్పురవ్వలు పడి కాలిపోయింది. సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయం ముందు నిర్వహించగా కొందరు టపాసులు కాల్చారు. దీంతో వీటి నిప్పురవ్వలు జెండా పడటంతో కాలిపోగా పంచాయతీ సిబ్బంది జెండా తీసివేశారు. జెండా ఉన్న సంగతి తెలిసి కూడా అక్కడ టపాసులు పేల్చడమేమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాలిన జాతీయజెండాను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మహనీయుల త్యాగాలు మరవద్దు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ సాంబయ్య

- పదోపటాలం కమాండెంట్ ఎన్‌వీ సాంబయ్య

ఎర్రవల్లి: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే ఈరోజు మనమంతా స్వతంత్రంగా జీవిస్తున్నామని.. అలాంటి వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పదో పటాలం కమాండెంట్ ఎన్‌వీ సాంబయ్య కోరారు. ఆదివారం ఎర్రవల్లి మండలం బీచుపల్లి పదోపటాలంలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినందున గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం కన్న కలలను సాకారం చేసేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం పటాలంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన విశ్రాంత సిబ్బందిని కమాండెంట్ అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ టి.పాణి, ఆర్ఐలు రాజు, వెంకటేశ్వర్లు, ఆర్పీ సింగ్, రాజారావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై అభయాంజనేయుడు



ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. రెండోరోజు ఆదివారం ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గజవాహన సేవ నిర్వహించారు. భక్తుల భజనల నడుమ స్వామివారు గజ వాహనంపై ఊరేగారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు శివస్వాములు పాల్గొన్నారు.

బెబ్బులికి పూర్వవైభవం



సాక్షి ఎఫెక్ట్..

శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు ప్రధాన కూడలిలోని ఫారెస్టు డివిజనల్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన పెద్ద పులుల బొమ్మలు ఎట్టకేలకు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. గత కొన్నాళ్లుగా ఇక్కడి పెద్ద పులుల బొమ్మలు రంగులు వెరసి కళావిహీనంగా మారిన వైనంపై ఈ నెల 23న 'సాక్షి' దినపత్రికలో 'లక్ష్యం నెరవేరిందో.. నిర్లక్ష్యం ఆవహించిందో' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అటవీ శాఖ అధికారులు పెద్ద పులుల బొమ్మలకు రంగులు వేశారు. దీంతో ఆదివారం గణతంత్ర వేడుకలకు వచ్చిన వారికి నిజమైన పెద్ద పులులా కనిపించి ఆశ్చర్యపరిచాయి.

- మన్ననూర్

కాల్వకు గండి.. నీట మునిగిన పంటలు



తెగిన కాల్వ

మల్దకల్: మండలంలోని చర్లగార్లపాడు శివారులో 106 ప్యాకేజీ కాల్వకు ఆదివారం గండి పడటంతో పంటలు నీట మునిగాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వ షట్టర్‌ను కొందరు రైతులు మూసివేయడంతో నాగర్‌దొడ్డి, కుర్తిరావులచెర్వు మీదుగా తూంకుంటకు వెళ్లే కాల్వలో నీటి ఉధృతి పెరగడంతో పాటు కాల్వలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వ తెగిపోయింది. నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. మొత్తం 25 ఎకరాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, పొగాకు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు సుధాకర్, ధర్మన్న, నాగరాజు, ప్రేమ్‌రాజ్, ప్రసాద్, కత్రెన్న, బుడ్డన్న, వెంకటన్న తెలిపారు. నష్ట పరిహారం అందించడంతో పాటు కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామ శివారులో నిర్మిస్తున్న భారత్‌మాల రోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. బింగుదొడ్డి సమీపంలోని చెరువులో భారత్‌మాల రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్.. మట్టిని తరలించారని తెలిపారు. గ్రామంలో పాఠశాల భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పటి వరకు సగం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు పూర్తిచేసిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



రోడ్డు పనులను అడ్డుకుంటున్న బింగుదొడ్డి గ్రామస్తులు

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మక్తల్: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మక్తల్ మండలం లింగంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లింగంపల్లికి చెందిన సురేష్ (42) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డిని వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



సురేష్ (ఫైల్)

వీధి కుక్కల దాడి

- ఐదుగురు చిన్నారులకు గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులపై ఆదివారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఇందులో స్పందన, నిహాల్, రాంకుమార్, శాన్విక, యస్వికకు గాయాలుకాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు వివరించారు. గ్రామంలో వీధి కుక్కల సంచారం అధికమైందని గ్రామస్తులు తెలిపారు.